## • జాతీయ భావాన్ని పెంపొందించాలి



వివిధ వేషధారణలతో విద్యార్థుల నృత్య ప్రదర్శన

**నంగునూరు(సిద్దిపేట):** మతాలు, కులాలు వేరైనా మనమంత ఒక్కటేనన్న భావన కలిగి ఉండాలిని ప్రిన్సిపాల్ జానయ్య అన్నారు. గురువారం అక్కెన పల్లి మోడల్ స్కూల్‌లో ఏక్ భారత్‌- శ్రేష్ఠ భారత్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల మధ్య పరస్పర అవగాహన, భిన్నత్వంలో ఏకత్వం పై అవగాహన కల్పించేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

## • ముందస్తు హోలీ సంబురాలు



మోతె ప్రాథమిక పాఠశాలలో హోలీ వేడుకలు

**మిరుదొడ్డి(దుబ్బాక):** మిరుదొడ్డి, అక్బర్‌పేట– భూంపల్లి మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు గురువారం ముందస్తు హోలీ సంబురాలు నిర్వహించారు. సహజ రంగులను పరస్పరం చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పండుగ విశిష్టతను, సహజరంగులపై విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కలిగించారు.

## • అందమైన చేతిరాతపై పోటీ



చేతిరాత పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

**చిన్నకోడూరు(సిద్దిపేట):** స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం అందమైన చేతిరాతపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు లక్ష్మయ్య మాట్లాడుతూ అందంగా అక్షర దోషాలు లేకుండా పదాలు, వాక్యాలు ఉండేలా చూసుకోవాలన్నారు. ఇలాంటి పోటీల ద్వారా భాషపై, అందమైన చేతిరాతపై పట్టు సాధిస్తారన్నారు.

## క్లుప్తంగా

### అర్థరహిత విమర్శలు తగదు

**బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి**

**మిరుదొడ్డి(దుబ్బాక):** బీఆర్‌ఎస్ నాయకులు విమర్శలు మాని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధికి సహకరించాలని దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకట్ స్వామి గౌడ్ హితవు పలికారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండు పర్యాయాలు ఎంపీగా, ప్రస్తుతం ఎమ్మెల్యేగా గద్దెనెక్కిన కొత్త ప్రభాకర్‌రెడ్డి దుబ్బాక అభివృద్ధికి ఏం చేశారని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నా దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఏలూరు కమలాకర్, నాయకులు సురేందర్‌రెడ్డి, చందు, మహిపాల్ యాదవ్, మల్లేశం పాల్గొన్నారు.

### దాతల సహకారం అభినందనీయం

**జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి**

**గజ్వేల్‌రూరల్:** ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కొడకండ్ల లోగల ఎంపీపీఎస్‌కు దాత తూం పద్మ రూ. లక్ష విలువ చేసే 20డెస్కులను అందజేశారు. ఈ సందర్భంగా పద్మను ఎంఈవో కృష్ణతో కలిసి గురువారం సన్మానించారు. డీఈవో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కాగా దాతలు ఆంజనేయులు, స్వామిలు విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ తూం శేఖర్, పాఠశాల హెచ్‌ఎం వెంకటేష్, ఉపాధ్యాయులు కవిత, దామోదర్, గ్రామస్తులు, యూటీఎఫ్ నాయకులు వలీఅహ్మద్, శ్రీనివాస్‌రెడ్డి, టీపీటీఎఫ్ నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న శ్రీకాంత్‌రావు

**ములుగు(గజ్వేల్):** సీఎం సహాయ నిధి పథకం పేదలకు వరమని టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు అన్నారు. గురువారం మండలంలోని మామిడ్యాల ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన జోగు కళమ్మకు రూ. 60 వేల సీఎం సహాయ నిధి చెక్కును అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుందన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు రుణమాఫీతో పాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిందన్నారు. కార్యక్రమంలో ములుగు, గజ్వేల్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్‌గుప్త, మల్లారెడ్డి నాయకులు భూపాల్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

### ఇంటర్‌విద్యను బలోపేతం చేద్దాం

**డీఐఈఓ రవీందర్‌రెడ్డి**

**సిద్దిపేటఎడ్యుకేషన్:** ఇంటర్‌విద్య బలోపేతానికి అందరి కృషి అవసరమని డీఐఈఓ రవీందర్‌రెడ్డి అన్నారు. ఇంటర్మీడియెట్ విద్యాశాఖ నాన్‌టీచింగ్ ఉద్యోగుల క్యాలెండర్‌ను గురువారం స్థానిక కార్యాలయంలో రవీందర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఐఈఓ మాట్లాడుతూ ఇంటర్ విద్య బలోపేతానికి నాన్‌టీచింగ్ ఉద్యోగుల పాత్ర కీలకమన్నారు. టీచింగ్, నాన్‌టీచింగ్ అందరూ తమ బాధ్యతలను సమర్థవంగా నిర్వర్తించి ఇంటర్ విద్యకు జిల్లాలో మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాన్‌టీచింగ్ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు, ప్రధానకార్యదర్శి చక్రవర్తి, కోశాధికారి కృష్ణారెడ్డి, ఆయా మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

# కాలేజీలకు కొత్త సార్లొచ్చారు..

- జిల్లాకు 49 మంది కేటాయింపు
- విధుల్లో చేరిన అధ్యాపకులు



డీఐఈఓ సమక్షంలో సిద్దిపేట కోఎడ్యుకేషన్ కళాశాలలో విధుల్లో చేరుతున్న అధ్యాపకుడు

**సిద్దిపేటఎడ్యుకేషన్:** జిల్లాలోని పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు కొత్త అధ్యాపకులు వచ్చారు. లెక్చరర్ల నియామకానికి 2022లో నోటిఫికేషన్ వెలువడింది. 2023లో పరీక్ష నిర్వహించారు. 2024లో ఫలితాలను వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఇటీవల నియామక పత్రాలు అందుకున్న అధ్యాపకులు గురువారం విధుల్లో చేరారు. జిల్లాకు మొత్తం 49 మంది నూతన అధ్యాపకులను ప్రభుత్వం కేటాయించింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వివిధ సబ్జెక్టులలో పలువురు అధ్యాపకులు జాయిన్ అయ్యారు. జేఎల్ నోటిఫికేషన్ తర్వాత పరీక్ష రాసి రెండు సంవత్సరాలు, ఫలితాలు వెల్లడయిన తర్వాత మరో సంవత్సరం.. మొత్తం సుమారు మూడేళ్ల పాటు వివిధ కారణాలచే నిరీక్షించిన వారు ఎట్టకేలకు విధుల్లో చేరారు. కొంగొత్త ఆలోచనలు, కోటి ఆశలతో విధుల్లో చేరిన పలువురి అధ్యాపకుల అభిప్రాయాలు వారి మాటల్లో...

### రెండో ప్రయత్నంలోనే..



మాది ఖమ్మం జిల్లా. పదోతరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో, నిజాం కళాశాలలో పీజీ చదివాను. 2008లో ఒక సారి ప్రయత్నించి విఫలమయ్యాను. రెండో ప్రయత్నంలో ఉద్యోగం సాధించాను. అధ్యాపకునిగా పనిచేస్తూనే సబ్జెక్టుతో పాటు జనరల్ నాలెడ్జ్‌పై పట్టు సాధించి ఉద్యోగం సంపాధించడం మరిచిపోలేనిది. విద్యార్థులకు అన్ని రకాలుగా సహకరించి ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తా.

**– అమర మురళీ, జువాలజీ అధ్యాపకుడు, బెజ్జంకి**

### కల నెరవేరింది.

లెక్చరర్ కావాలన్న కల నెరవేరింది. మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించినందుకు ఆనందంగా ఉంది. ప్రభుత్వ కళాశాలల్లోని చదివే విద్యార్థులకు ఉత్తమ బోధన అందించేందుకు నా వంతు పూర్తి బాధ్యతతో పనిచేస్తాను. పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివాను. పీజీ కాకతీయ యూనివర్సిటీలో పూర్తి చేశాను.

**– సుమలత, బాటనీ అధ్యాపకురాలు, తొగుట**

### కుటుంబ సభ్యుల సహకారం..



నా కుటుంబ సభ్యుల సహకారం, అధ్యాపకుల ప్రోత్సాహం నన్ను అధ్యాపకునిగా నిలిపాయి. సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల (కోఎడ్యుకేషన్)లో ఇంటర్మీడియెట్ చదివాను. కళాశాలలో నాకు చదువు చెప్పిన గురువులు నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. మద్దూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకునిగా నియామకం కావడం సంతోషంగా ఉంది. విద్యార్థులకు మార్గదర్శకునిగా ఉంటూ ఉత్తమ విద్యను అందించేందుకు కృషి చేస్తా.

**– వెంకటస్వామి, చరిత్ర అధ్యాపకుడు, మద్దూరు**

### చదివిన కళాశాలలోనే..



నేను ఇంటర్మీడియెట్ చదివిన సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే అధ్యాపకునిగా జాయిన్ కావడం చాలా సంతోషంగా ఉంది. నా తల్లిదండ్రుల కష్టం, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో లెక్చరర్‌గా ఉద్యోగం సంపాందించాను. 12 సంవత్సరాలుగా గురుకుల కళాశాలల్లో పనిచేసిన అనుభవం నాకు ఎంతో ఉపయోగపడింది. నిబద్ధతతో పని చేస్తూ పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారు ప్రయోజకులు అయ్యేలా ప్రొత్సహిస్తాను.

**– గూడెల్లి నరేందర్‌రెడ్డి, జువాలజీ అధ్యాపకులు, సిద్దిపేట జూనియర్ కళాశాల(కోఎడ్యుకేషన్)**

### నిబద్ధతతో పనిచేయండి



నూతనంగా విధుల్లో చేరిన అధ్యాపకులకు శుభాకాంక్షలు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పేద, మధ్యతరగతి విద్యార్థులే ఎక్కువగా ఉంటారు. వారికి అన్ని విధాలుగా సహకరిస్తూ, నాణ్యమైన విద్యను అందంచాలి. ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు నిబద్ధతతో పనిచేయాలి. విధుల్లో అలసత్వం వహించకుండా సమయ పాలన పాటిస్తూ ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి. విద్యార్థులకు మార్గదర్శకులుగా ఉండాలి.

**– రవీందర్‌రెడ్డి, డీఐఈఓ**

## దశలవారీగా సమస్యల పరిష్కారం

**కాంగ్రెస్ నేత చెరుకు శ్రీనివాస్‌రెడ్డి**



ఎల్లారెడ్డిపేటలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

**తొగుట(దుబ్బాక):** దుబ్బాక నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎల్లారెడ్డిపేటలో రూ 10లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాక నిధులు సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాలకు తరలించుకుపోయారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో దుబ్బాకలో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తానని చెప్పారు. మండలంలో అన్ని గ్రామాలకు సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. అనంతరం కాగ్గల్ రూ 10లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అక్కం స్వామి, మాజీ సర్పంచ్‌లు కొండల్‌రెడ్డి, నర్సింలుగౌడ్, మాజీ ఎంపీటీసీ సత్తయ్య నాయకులు వెంకట్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, స్వామియాదవ్, నరేందర్‌రెడ్డి, బాలమల్లు, యాదగిరి పాల్గొన్నారు.

### ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగాలి

**గజ్వేల్‌రూరల్:** విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సీఐ సైదా అన్నారు. పట్టణంలోని గీతాంజలి హై స్కూల్‌లో గురువారం విద్యార్థులకు షీటీమ్, సైబర్ నేరాలు, మహిళలకు ఉన్న రక్షణ చట్టాలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుల్లో రాణించి ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని చెప్పారు. చదువుకుంటేనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని, విద్యార్థులు తమ తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని సూచించారు.

### ఎకరాకు రూ.50వేల నష్టపరిహారం ఇవ్వాలి

**ఎండిన వరి పంటలను పరిశీలించిన సీపీఎం బృందం**

**చేర్యాల(సిద్దిపేట):** వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎండిపోయిన వరి పంటకు ఎకరానికి రూ.50వేల నష్ట పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొంగరి వెంకట్‌మావో డిమాండ్ చేశాడు. గురువారం మండల పరిధిలోని తాడూరు, చిట్యాల, దానంపల్లి, కమలాయపల్లి, అర్జున్‌పట్ల గ్రామాల్లో సీపీఎం బృందాలు ఎండిన వరి పంటలను పరిశీలించాయి. అనంతరం సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వెంకట్‌మావో మాట్లాడుతూ ప్రభుత్వానికి ముందు చూపు లేక దేవాదుల ప్రాజెక్టును గోదావరి నీటితో నింపకపోవడం వల్లనే ఈ పరిస్థితి దాపురించిందని విమర్శించారు.

## గ్రూప్‌–2 ర్యాంకర్ మణికంఠేశ్వర్‌రెడ్డికి సన్మానం



మణికంఠేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆకుల రజిత

**హుస్నాబాద్:** మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు మణికంఠేశ్వర్‌రెడ్డి గ్రూప్‌–2లో 103వ ర్యాంక్ సాధించిన సందర్భంగా గురువారం ఆయనను మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆకుల రజిత ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మణికంఠేశ్వర్‌రెడ్డి గ్రూప్‌–1లో మంచి ర్యాంక్ సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకట్, స్థానికులు కొమురెల్లి రవీందర్, మర్యాల తిరుమల్‌రెడ్డి, పచ్చిమట్ల రవీందర్‌గౌడ్, బోజు రవీందర్, ఎలకంటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ప్రతిభ చాటినప్పుడే గుర్తింపు

**ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గణేశ్**



రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు వెళ్తున్న క్రీడాకారులు

**గజ్వేల్‌రూరల్:** క్రీడాకారులు తమలోని ప్రతిభను చాటినప్పుడే గుర్తింపు లభిస్తుందని ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాంగారి గణేష్ పేర్కొన్నారు. వనపర్తిలోని డాక్టర్ బాలకిష్టయ్య క్రీడాప్రాంగణంలో ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో అండర్ 14 బాల, బాలికల విభాగంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు గురువారం ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు కోచ్ నర్సింలుతో కలిసి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం వల్ల చదువుతో పాటు ఉద్యోగాలలో అవకాశాలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైన గజ్వేల్ ఫుట్‌బాల్ క్లబ్ క్రీడాకారులు నిశ్చిత, అక్షిత్, పవన్, మారుతితో పాటు వర్గల్‌కు చెందిన మహాత్మా జ్యోతిరావుపూలే రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు నితిశ, వసంత, మనుశ్రీ, లహరికలను అభినందించారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ క్లబ్ సభ్యులు చక్రపాణి, ఎల్లయ్య పాల్గొన్నారు.

## గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలి

**బీఎస్పీ, గో సంరక్షణ కమిటీ డిమాండ్**



కమిషనర్ మల్లికార్జున్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

**హుస్నాబాద్:** వారసంతలో గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గో సంరక్షణ కమిటీ, బీఎస్పీ ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హుస్నాబాద్ వారసంతలో వెటర్నరీ డాక్టర్ అనుమతి లేకుండానే గోవులు, ఎద్దులు, బర్రెలను పశువధశాలలకు అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు. కటిక వ్యాపారస్తులు అక్రమంగా పశువులను కొనుగోలు చేసి వధించడం వల్ల పశు సంపద గణనీయంగా తగ్గుతుందన్నారు. రైతులు తమ అవసరాలకు పశువులను కొనుగోలు చేద్దామంటే అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తుందన్నారు. కొత్త అంగడి టెండర్ ప్రక్రియలో పాల్గొనే కాంట్రాక్టర్లు విధిగా నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్‌గౌడ్, గో సంరక్షణ కమిటీ సభ్యులు కోడూరి శ్రీదేవి, శంకర్, శ్రీను, విక్రమ్ తదితరులు ఉన్నారు.

## వరిలో కంకినల్లి తెగులును గుర్తించాలి

**ఏఈఓ నాగార్జున**



పెద్ద మాసాన్‌పల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న ఏఈఓ నాగార్జున

**తొగుట(దుబ్బాక):** వరి పంటకు కంకినల్లి, కంకి ఎండుతెగుళ్లు సోకి పంటకు తీవ్రనష్టం కలిగిస్తాయని ఏఈఓ నాగార్జున తెలిపారు. మండలంలోని పెద్ద మాసాన్‌పల్లిలో సాగుచేసిన వరి పంటను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వరి పొట్ట దశ నుంచి కంకివేసే దశలో ఉందన్నారు. కంకిలోని గింజల పైన నల్లమచ్చలను గుర్తించామన్నారు. దీనికి ప్రధాన కారణం కంకినల్లి, బ్యాక్టీరియా కంకిఎండు తెగులు సోకే అవకాశం ఉందన్నారు. కంకినల్లి కంటికి కనిపించకుండా చిన్నగా ఉంటుందని చెప్పారు. సాధారణంగా కంకినల్లి పొట్టదశ నుంచి పాలుపోసుకునే దశలో ఉన్న పంటకు సోకే అవకాశముందని చెప్పారు. పాలు పోసుకునే దశలో గింజలపై నల్లమచ్చలు ఏర్పడుతాయని, అలాగే.. తాలు గింజలుగా మారుతాయన్నారు. కంకిఎండు తెగులు కూడా సోకినట్లు గుర్తించామన్నారు. ఈ తెగులు లక్షణాలు కూడా కంకినల్లి ఆశించినట్లుగానే కనిపిస్తాయన్నారు. బ్యాక్టీరియా కంకి ఎండు తెగులు, కంకినల్లి నివారణకు ప్రాపికోనజోల్, 2మిల్లీలీటర్లు, స్పైరోసిఫిన్ ఒక మిల్లీలీటరు లీటరు నీటిలో కలిపి స్ప్రే చేయాలని ఆయన రైతులకు సూచించారు.

## ఒక వర్గానికే ప్రాధాన్యమా?

- కాంగ్రెస్‌లో ముదిరిన అసమ్మతి
- దర్గపల్లిలోని ఓ తోటలో రహస్య మంతనాలు

**నంగునూరు(సిద్దిపేట):** అధికార కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి రాజుకుంది. ఒకే వర్గానికి ప్రాధాన్యం ఇస్తూ తమకు కనీసం సమాచారం ఇవ్వడంలేదని పలు గ్రామాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు గురువారం దర్గపల్లిలోని ఓ తోటలో రహస్య మంతనాలు జరిపారు. నంగునూరు మండలంలోని పలు గ్రామాలకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద సీసీ రోడ్డు పనులకు నిధులు మంజూరయ్యాయి. దీంతో ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నేతలకు సిద్దిపేట పార్టీ ఇన్‌చార్జి సీసీ నిర్మాణం పనులు అప్పగించారు. ఇటీవల కొత్తగా పార్టీలో చేరిన వారితో పాటు ఎన్నో ఏళ్లుగా పార్టీని నమ్ముకున్న తమను మండల నాయకులు విస్మరిస్తున్నారని బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నేపథ్యంలో దర్గపల్లిలోని ఓ మామిడి తోటలో 14 గ్రామాల నుంచి 30 మంది వరకు ఆ పార్టీ నాయకులు హాజరవడం ప్రాధాన్యత సంతరించుకుంది. మండల నాయకులు కులం పేరుతో విభజిస్తూ ఒకే వర్గానికి ప్రాధాన్యతం ఇస్తున్నారని వారు వాపోతున్నారు., ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లకుండా తమను అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. పార్టీని భ్రష్టు పట్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అధిష్టానాకి ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం.

## సంక్షిప్త వార్తలు

**◆ సమస్యల పరిష్కారానికి కృషి**

**నంగునూరు(సిద్దిపేట):** గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. గురువారం పాలమాకులలోని వడ్డెర కాలనీలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద మంజూరైన నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభించారు. యాదగిరి, శంకర్, లక్ష్మి, అశోక్‌గౌడ్, సత్తయ్య, రవీంద్రాచారి, బస్వరాజు రాములు, మహేందర్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

**◆ విద్యారంగానికి నిధులు కేటాయించాలి**

**గజ్వేల్‌రూరల్:** బడ్జెట్‌లో విద్యారంగానికి 15శాతం నిధులను కేటాయించాలని బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్, మండల శాఖ అధ్యక్షుడు అశోక్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లోనే ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతను తట్టుకోలేక ఢిల్లీకి పరుగులు పెడుతున్నారని విమర్శించారు.

**◆ మందుబాబులకు జరిమానా**

**సిద్దిపేటకమాన్:** మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 7మంది పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో గురువారం హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి.. రూ.12వేల జరిమాన విధించినట్లు సీఐ తెలిపారు.

**◆ కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి**

**ప్రశాంత్‌నగర్(సిద్దిపేట):** కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాల అభివృద్ధిపై దృష్టి పెట్టలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చిందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో ముందుకు సాగిస్తున్నారని చెప్పారు. గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకుగాను ముఖ్యమంత్రి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి మధు, పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నజ్జు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

**◆ కేటీఆర్ క్షమాపణలు చెప్పాలి**

**ప్రశాంత్‌నగర్(సిద్దిపేట):** గవర్నర్ ప్రసంగాన్ని అవమానించే విధంగా మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడటం సరికాదని, వెంటనే గవర్నర్‌కు ఆయన క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ నేత కిరణ్‌కుమార్‌రావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగాన్ని విమర్శించడం తగదన్నారు. అధికారం పోయినా బీఆర్‌ఎస్ నాయకులకు అహంకారం తగ్గలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారని విమర్శించారు.

**◆ ఆనందయ్య జాతరకు ఏర్పాట్లు పూర్తి**

**బెజ్జంకి(సిద్దిపేట):** బేగంపేటలోని సంగమేశ్వర ఆలయ సన్నిధిలో శుక్రవారం నిర్వహించే సద్గురు ఆనందయ్య జాతరకు ఏర్పాట్లు పూర్తయినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి ఏటా హోలీ పర్వదినాన జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. శివలింగాభిషేకం, ప్రత్యేక పూజలతో పాటు రథోత్సవ వేడుకలు నిర్వహిస్తారు.

**◆ నూతన తహసీల్దార్‌కు సన్మానం**

**దుబ్బాకటౌన్:** రాయపోల్ నూతన తహసీల్దార్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌ను మండల కాంగ్రెస్ నాయకులు శాలువ కప్పి గురువారం ఘనంగా సన్మానించారు. ప్రజలకు ఎల్లవేళల అందుబాటులో ఉంటూ.. సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుధాకర్, నాయకులు కిష్టారెడ్డి, మహేష్, ప్రశాంత్, నరేష్, ఇంద్రకరణ్, తదితరులున్నారు.

**◆ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరణ**

**జగదేవ్‌పూర్(గజ్వేల్):** జగదేవ్‌పూర్ ఎంపీడీవోగా రాంరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో యాదగిరి పరస్పర బదిలీపై నల్లగొండ జిల్లా చండూరుకు వెళ్లగా, అదే జిల్లాకు చెందిన రాంరెడ్డి బదిలీపై జగదేవ్‌పూర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

**◆ హామీలను అమలుచేయలేక చేతులెత్తేస్తారా?: వంటేరు ప్రతాప్‌రెడ్డి**

**గజ్వేల్:** ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతగాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులెత్తుస్తున్నారని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ఏదీ ఖర్చు చేసినా ఉత్పాదక రంగాల అభివృద్ధికే చేశారని చెప్పారు. కేసీఆర్ కార్యక్రమాలు రాష్ట్రంలో కొత్త సంపదను సృష్టించాయని తెలిపారు. నేడు వాటిని అమలు చేయడం చేతకాక చేతులెత్తేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.